స్వయం ఉపాధిలో మేటి.. దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్



బ్లాకు ప్రింటింగ్ వస్త్రాలతో విద్యార్థులు



దోర్ కర్టెన్లపై బ్లాకుతో ప్రింట్ వేసిన విద్యార్థులు

- చేతివృత్తుల్లో ఉపాధికి తోడ్పడుతున్న ఇన్‌స్టిట్యూట్
- శిక్షణ పొందుతున్న వారిలో 90 శాతం మహిళలే

ఆరిలోవ : దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్ చేతివృత్తులలో యువతకు శిక్షణ అందించి వారి జీవనోపాధికి తోడ్పడుతోంది. ఇక్కడ శిక్షణ పొందినవారిలో ఎక్కువమంది మహిళలే. ప్రస్తుతం నగరంలోని ఓ డిగ్రీ కళాశాల విద్యార్థినులు శిక్షణ పొందుతున్నారు.

కళాశాలలతో ఒప్పందం

జీవీఎంసీ 9వ వార్డులోని దయాల్‌నగర్‌లో దయాల్‌బాగ్ వర్సిటీ ఆధ్వర్యంలో దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ యువతకు టైలరింగ్, మోటార్ మెకానిక్, ఎంబ్రాయిడరీ, అద్దకం తదితర వృత్తుల్లో శిక్షణ ఇస్తారు. ఇక్కడ శిక్షణ పొందినవారిలో సుమారు 90 శాతం మంది మహిళలే. ప్రస్తుతం టెక్స్‌టైల్స్ డిజైనింగ్ అండ్ ప్రింటింగ్‌లో విద్యార్థినులకు శిక్షణ జరుగుతోంది. నగరంలోని జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ కాలేజీ ఫర్ ఉమెన్స్ నూతన విద్యా విధానంలో భాగంగా దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌తో ఇటీవల ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం ఈ కళాశాలలో బీఎస్సీ హోం సైన్స్ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థినులు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా 45 రోజులు, మూడు నెలలు(540 గంటలు) శిక్షణ తీసుకుంటారు. ఈ ఒప్పందం ప్రకారం మూడేళ్లు ఆ కళాశాల హోం సైన్స్ విద్యార్థినులకు ఇక్కడ శిక్షణ ఇస్తారు.

టెక్స్‌టైల్స్ డిజైనింగ్ అండ్ ప్రింటింగ్‌లో శిక్షణ

ప్రస్తుతం ఇక్కడ టెక్స్‌టైల్స్ డిజైనింగ్ అండ్ ప్రింటింగ్‌లో బీఎస్సీ మూడో సంవత్సరం విద్యార్థినులు 21 మందికి రెండు నెలలుగా శిక్షణ ఇస్తున్నారు. మూడు నెలల కాలపరిమితితో ప్రారంభమైన ఈ శిక్షణ మరో నెల పాటు కొనసాగనుంది. ఈ శిక్షణ కోసం విద్యార్థినులకు సబ్జెక్టుకు సంబంధించిన స్టడీ మెటీరియల్, రంగులు, కెమికల్స్ అందిస్తారు. వాటితో ఇక్కడ బ్లాకు ప్రింటింగ్, టై అండ్ డై, స్క్రీన్ ప్రింటింగ్ నేర్పుతున్నారు. క్లాత్‌పై ఆయా ప్రింట్లు వేసి వస్త్రాలను ఆకర్షణీయంగా రూపొందిస్తున్నారు. వాటికి మంచి గిరాకీ కూడా వస్తోంది. శిక్షణలో చీరలు, తువ్వాళ్లు, డోర్ కర్టెన్లు, బెడ్‌షీట్లు, నైటీలు, టాప్‌లపై ప్రింట్లు వేసి అందంగా ముస్తాబు చేస్తున్నారు.

మెలకువలు నేర్పుతున్నారు



శిక్షణలో బ్లాకు ప్రింట్లు ఏవిధంగా వేయాలో మెలకువలు నేర్పుతున్నారు. శిక్షకులు నేర్పిన మేరకు శ్రద్ధగా ప్రింట్లు వేస్తున్నాము. బీఎస్సీ పూర్తయిన తర్వాత ఇక్కడ నేర్చుకొన్న నైపుణ్యంతో ప్రత్యేకంగా ఇనిస్టిట్యూట్ నిర్వహించాలని ఉంది. మరికొంతమందికి దీనిలో తర్ఫీదు ఇవ్వాలనుకున్నాం.

–పి.గౌతమి, పుష్పలత, రాతం, శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

విద్యార్థుల్లో ఆసక్తి



ప్రస్తుతం ఇక్కడ శిక్షణ పొందుతున్న 21 మంది విద్యార్థినులు నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. వారికి స్టడీ మెటీరియల్‌తో పాటు కెమికల్స్ ఇస్తున్నాము. వాటితో ప్లెయిన్ క్లాత్‌పై బ్లాక్‌లతో ప్రింట్లు వేయడం నేర్పుతున్నాం. టీషర్టులు, చీరలు, టవల్స్, బెడ్‌షీట్లు, నైటీలు, కర్టెన్లు తదితర వాటిని సిద్ధం చేస్తున్నారు. ఈ శిక్షణ వారికి సొంతకాళ్లపై నిలవడానికి భవిష్యత్‌లో ఉపయోగపడుతుంది.

–వారణాసి జ్యోతి, మెంటార్

ఎంతో ఉపయోగం



ఇక్కడ గతంలో శిక్షణ పొందినవారు 62 మంది వారి సొంత ప్రాంతాల్లో ఇనిస్టిట్యూట్‌లో నిర్వహిస్తున్నారు. ఇతర మహిళలకు శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పించడంలో సహాయపడుతున్నారు. సెయింట్ జోసెఫ్ ఉమెన్స్ కాలేజీతో మూడేళ్లు ఒప్పందం కుదుర్చుకున్నాం. బీఎస్సీ హోం సైన్స్ విద్యార్థినులకు రెండో సంవత్సరం వారికి 45 రోజులు, మూడో సంవత్సరం వారికి మూడు నెలల కాలపరిమితితో శిక్షణ అందించనున్నాం. ఈ శిక్షణ స్వయం ఉపాధికి చాలా ఉపయోగం.

–వి.దక్షిణామూర్తి, ఇన్‌చార్జి, దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్

ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో అపార అవకాశాలు

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి



సదస్సును ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ ఆఫీస్, ఏయూ ఐపీఆర్ చైర్, ఏపీ చాంబర్స్, టీం ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ సంయుక్తంగా 'ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్'పై జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌ను వీసీ ప్రారంభించి, మాట్లాడారు. ఫుడ్ ప్రొడక్షన్ రంగంలో నూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. డీఎఫ్ఆర్ఎల్, ఏపీ ఫుడ్ సొసైటీతో సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. నూతన ఆలోచనలతో వచ్చే యువతకు ఆర్థిక సహకారం అందించడానికి అనేక మంది పెట్టుబడిదారులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆహార ఉత్పత్తి రంగానికి డిమాండ్ పెరుగుతూ వస్తోందన్నారు. ఏయూలో నూతనంగా ఫుడ్ టెక్నాలజీలో ఐదేళ్ల కోర్సును ప్రారంభించడంతో పాటు ఎమ్మెస్సీ సీట్లను పెంచామన్నారు. ఏయూ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ ఆహార కొరత లేకుండా వృథాను నియంత్రిస్తూ, వ్యవసాయ రంగానికి లాభదాయకంగా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు కావాలన్నారు. ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కొత్త ఆలోచనలతో పనిచేసేవారికి వైవిధ్యమైన అవకాశాలు ఉన్నాయన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి సింహాచలం మాట్లాడుతూ యువత పారిశ్రామికవేత్తలుగా మారాలన్నారు. ఉపాధి కోసం ఎదురుచూడకుండా ఉపాధి కల్పించే దిశగా ఆలోచనలు చేయాలని సూచించారు. నెట్‌వర్కింగ్ నిపుణుడు మిథున్ మాట్లాడుతూ వ్యాపార విస్తరణ, నిర్వహణలో నెట్‌వర్కింగ్ ఎంతో కీలకమన్నారు. శ్రావణ్‌షిప్పింగ్ అధినేత జి.సాంబశివరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతంలో సహజ వనరులు అధికంగా ఉంటాయని చెప్పారు. ఎగుమతులు చేసే స్థాయికి యువతరం ఎదగాలన్నారు. టీం ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ డి.మధుసూదనరావు మాట్లాడుతూ ఎదగాలనే ఆకాంక్ష నూతన సంస్థల ఏర్పాటుకు నాందిగా నిలుస్తుందన్నారు. ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌చార్జి జి.వి.ఆర్.నాయుడు సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏయూ సమాచారమ్

ఓఎన్‌జీసీ విశ్రాంత ఉద్యోగికి డాక్టరేట్



ఉత్తర్వులు స్వీకరిస్తున్న లక్ష్మణరావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల పరిశోధక విద్యార్థి బయ్యే లక్ష్మణరావుకు డాక్టరేట్ లభించింది. విభాగ విశ్రాంత ఆచార్యుడు డి.సూర్య ప్రకాశరావు పర్యవేక్షణలో ఉమెన్ అగ్రికల్చరల్ లేబర్–పాలసీపర్‌స్పెక్టివ్స్–ఏ సోషియో లీగల్ స్టడీ ఇన్ సెలక్టెడ్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్'అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ వరించింది. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను లక్ష్మణరావు స్వీకరించారు. ఓఎన్‌జీసీలో జనరల్ మేనేజర్‌గా పని చేసి పదవీ విరమణ చేసిన లక్ష్మణరావు ఉన్నత విద్యపై ఆసక్తితో డాక్టరేట్ పూర్తి చేశారు.

డీఈవో సందర్శన



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న డీఈవో చంద్రకళ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు మాధ్యమం పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ట్యాబ్స్ వినియోగం, జగనన్న విద్య కానుక కిట్స్ నిర్వహణ, నోట్‌బుక్స్ కరక్షన్, పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న తీరు, తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు డీఈవో స్వయంగా మధ్యాహ్న భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో అప్పలనాయుడు, ఏఎల్ఎస్‌సీవో వి.శైలజ, ప్రధానోపాధ్యాయిని కె.సలోమి, తదితరులు పాల్గొన్నారు.

అడుగంటిన జూ కొలను



జూ కొలనులో అడుగంటిన నీరు



ఎండిపోయిన కొలను వెనుక భాగం

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో కొలను ఎండిపోతోంది. వేసవి ఎండలు రాకముందే ఇక్కడ నీరు ఆవిరైపోయింది. దీంతో అడుగు భాగంలోనే కొద్దిగా నీరు కనిపిస్తుంది. ఇందులో నిండుగా నీరు ఉన్నప్పుడు వన్యప్రాణులతో పాటు ఈ కొలను కూడా సందర్శకులను అలరించేది. ఇందులో చేపల కోసం పక్షులు నిత్యం కొలను చుట్టూ చేరి కిలకిలారావాలతో సందడి చేసేవి. చుట్టూ పచ్చదనం కనువిందు చేసేది. జూ లోపల కొండలపై స్వేచ్ఛగా సంచరించే కనుజులు, జింకలు సాయంత్రం వేళల్లో దాహం తీర్చుకుంటూ.. సేద తీరేది ఇక్కడే. ప్రస్తుతం ఈ కొలనులో నీరు అంతకంతకూ అడుగంటిపోతుండటంతో పక్షులకు, జంతువులకు తాగునీటి ఇక్కట్లు తప్పేలా లేవు. మార్చి రెండో వారానికే ఇలా ఉంటే.. ఎండలు తీవ్రరూపం దాల్చే ఏప్రిల్, మేలో పరిస్థితి మరింత దారుణంగా మారనుంది. దీంతో ఇప్పటి నుంచే వన్యప్రాణుల సంరక్షణకు జూ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయక తప్పదు.

చిలుకలు కావు.. పువ్వులే..!



ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆవరణలో చిలుకలు ఆకారంలో రంగులు పువ్వులు

ఆరిలోవ : రంగు రంగుల చిలుకలు.. ఒక దానిపై మరొకటి వాలినట్లున్నాయి కదూ..! ముచ్చటైన నెలతో ఈ చిలుకలు ఎంత అందంగా ఉన్నాయో..! అంటూ చూసేవారంతా కాసేపు అక్కడే నిల్చుని.. కళ్లారా చూశాక గానీ అసలు విషయం తెలుసుకోలేకపోతున్నారు. తీరా తెలిశాక ఆశ్చర్యపోవడం వారి వంతవుతోంది. హనుమంతవాక దరి ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆవరణలో వివిధ రకాల పూల మొక్కలున్నాయి. ఇవి ఇక్కడకు కంటి సమస్యలతో వచ్చిన వారిని, వారి సహాయకులను ఆకర్షిస్తున్నాయి. వాటిలో తీగ మొక్కలకు గులాబీ, పసుపు, ఆకుపచ్చని రంగులతో కూడిన పూలు వేలాడుతున్నాయి. ఈ పూలు తీగకు రెండు పక్కల ఒకదానిపై మరొకటి వరుసగా పేర్చినట్టున్నాయి. ఇవి చూడడానికి అందమైన రంగులతో కూడిన రెండేసి చిలుకలు ఎదురెదురుగా ఉన్నట్లు కనిపిస్తూ ఆకట్టుకుంటున్నాయి. కొద్ది దూరం నుంచి చూసేవారికి రంగుల చిలుకలుగా కనిపిస్తున్నాయి. దగ్గరకు వెళ్తేగానీ వాటిని పువ్వులుగా గుర్తించలేకపోతున్నారు.

వర్క్ ఫ్రం హోమ్‌తో బహుళ ప్రయోజనాలు

సీతంపేట(విశాఖ ఉత్తర): కోవిడ్ మహమ్మారి కారణంగా వెలుగులోకి వచ్చిన వర్క్ ఫ్రం హోమ్ విధానం అటు వ్యాపార సంస్థలు, ఇటు ఉద్యోగులకు బహుళ ప్రయోజనాలు చేకూర్చిందని సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్(సిడార్) చైర్మన్ ప్రొఫెసర్ కె.సి.రెడ్డి తెలిపారు. ఇంటి నుంచి పని, ఉద్యోగుల దృక్పథాలు అనే అంశంపై సంస్థ చేపట్టిన సర్వే నివేదికను శుక్రవారం బుల్లయ్య కళాశాలలో జరిగిన సదస్సులో ఆవిష్కరించారు.

సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా కృషి



15వ వార్డు నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 15వ వార్డు పార్టీ నాయకులు, కార్యకర్తలతో స్థానిక కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబుల ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అత్యధిక మెజార్టీతో సీతంరాజు సుధాకర్ గెలిచేందుకు ప్రతి ఒక్క పట్టభద్రుని ఓటరు ఇంటికి వెళ్లి ఓటు అభ్యర్థించాలని సూచించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్, వెంకటలక్ష్మి, నరాల సత్తిబాబు, గొలగాని త్రినాథ్, నారాయణరావు, బుగత మేర్సీ, రామచంద్ర, కిరణ్, రాజారావు, అచ్యుత్, లక్ష్మణరావు, పైడినాయుడు పాల్గొన్నారు.

సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి



సమావేశంలో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు) : విశాఖను పరిపాలన రాజధానిగా ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా సీతంరాజు సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి బహుమతిగా ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 22వ వార్డులోని పాండురంగపురంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న సీఎం జగన్‌కు అందరూ మద్దతుగా నిలిచి సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, పాండురంగపురం అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీతంరాజుకే మా మద్దతు : ఏపీ టీచర్స్ యూనియన్

విశాఖ విద్య: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వాదంతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు ఏపీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.దేముడు, జి.దత్తాత్రేయశర్మ శుక్రవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్, నిరుద్యోగ సమస్యలను ఎమ్మెల్సీగా గెలిస్తే సీతంరాజు పరిష్కరిస్తారనే నమ్మకం ఉందని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు విస్తృత ప్రచారం



ఉద్యోగులకు కరపత్రాలు అందజేస్తున్న పితాని ప్రసాద్ తదితరులు

ఎంవీపీకాలనీ : ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపుతోనే నిరుద్యోగుల సంక్షేమం సాధ్యమవుతుందని రాష్ట్ర బీసీ సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్ అన్నారు. ఎంవీపీ కాలనీ, పెదవాల్తేర్‌లలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో బీసీ సంఘం ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు అందించి, సుధాకర్‌ను గెలిపించాలని ఉద్యోగులను, నిరుద్యోగులను అభ్యర్థించారు. ఈ సందర్భంగా పితాని ప్రసాద్ మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలోనే విశాఖతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు రాజకీయాల్లోనూ యువతకు సీఎం జగన్ పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. ఇలాంటి సమయంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరచిన సుధాకర్‌ను గెలిపిస్తే అన్ని అంశాల్లోను మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు ధర్మరాజు, సురేష్‌కుమార్, డాక్టర్ వెంకట్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయిపూలే చిరస్మరణీయురాలు



సావిత్రిబాయిపూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీసీ నాయకులు

మద్దిలపాలెం(విశాఖ తూర్పు) : మహిళా సాధికారతలో సావిత్రిబాయి పూలే భారతదేశ చరిత్రలో ధ్రువతారగా నిలిచిపోయారని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గొర్లె శ్రీనివాసనాయుడు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి లోగిశ గణేష్, బలగ సుధాకర్, శ్రీధర్, బంటుపల్లి భవాని తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: పైనాపిల్ కాలనీ 33/11 కేవీ పరిధిలో విద్యుత్ మెయింటినెన్స్ పనుల కారణంగా శనివారం పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్ నగర్, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, సీడీ కార్యాలయం తదితర ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా

సంక్షేమ పథకాలకే మా మద్దతు



కోర్టు ఆవరణలో సుధాకర్ ప్రచారం

బీచ్‌రోడ్డు : దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకే తమ మద్దతు ఉంటుందని లాయర్లు అన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్ జిల్లా కోర్టులో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచారానికి సీనియర్, జూనియర్ లాయర్ల నుంచి విశేష స్పందన లభించింది. మూడో నంబరు సీరియల్‌పై మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థి సుధాకర్ కోరారు. కార్యక్రమంలో శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శశిధర్ అనూషా పట్నాయక్, విశాఖ పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షులు జీఎం రెడ్డి, విశాఖ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు ఇమంది ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మి తదితురులు పాల్గొన్నారు.

ప్రత్యేక శ్రద్ధతోనే మహిళల ఆరోగ్యం



ఆరోగ్యకర వంటకాల తయారీపై డెమో

ఎంవీపీకాలనీ : ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పెదవాల్తేర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం మహిళలు, బాలింతలకు అవగాహన కల్పించారు. వాసవ్య మహిళా మండలి, కుషాల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కుషాల్ ప్రాజెక్టు కమ్యూనిటీ కో ఆర్డినేటర్ షరిష్మల మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా నిలిపేందుకు కుటుంబ సభ్యులు ఎలాంటి ఆహారం అందించాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వారి ఆరోగ్యానికి దోహదపడే పలు వంటకాలను డెమో ద్వారా వండి చూపించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం రేపు



కనకమహాలక్ష్మి అమ్మవారు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పరిధి ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ దరి కనకమహాలక్ష్మినగర్‌లో కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ పదో వార్షికోత్సవం ఆదివారం జరగనుంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం నేడు

ఎంవీపీ కాలనీ: స్థానిక అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ ఎండోక్రోనాలజీ(ఏసీఈ) ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. మధుమేహం, నేత్ర సమస్యలు, థైరాయిడ్, బీపీ తదితర సమస్యలపై ఉచిత పరీక్షలు నిర్వహించనున్నట్టు సంస్థ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిబిరం ఉంటుందన్నారు.